
సాక్షి బాపట్ల

ఆదివారం । 12 । అక్టోబర్ । 2025



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 74,106 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 82,090 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నీటి నిల్వ 42.1600 టీఎంసీలు.



విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

జె.పంగులూరు: మండల పరిధి కొండమంజులూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు 365 సైకిళ్లను శనివారం ఉచితంగా అందించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొన్నారు.



దుర్గగుడి ట్రస్ట్ బోర్డు ప్రమాణం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా బొర్రా రాధాకృష్ణ(గాంధీ), 15 మంది సభ్యులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు.

న్యూస్‌రీల్

29న జెడ్పీ సర్వసభ్య సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 29న ఉదయం 10.30 గంటలకు జరగనుంది. ఈ మేరకు జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులకు సమాచారం పంపారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరగనున్న సమావేశంలో అజెండాలో పొందుపర్చిన అంశాలతోపాటు వివిధ శాఖల ప్రగతిపై చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

16న మెగా జాబ్‌మేళా



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా ఉపాధి కార్యాలయం, సమర్థనం సంస్థ సంయుక్తంగా ఈ నెల 16న బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నాయని జిల్లా ఉపాధి అధికారి డి.దుర్గాబాయి తెలిపారు. గుజ్జనగుండ్లలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో శనివారం పోస్టర్లు విడుదల చేశారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్హత కలిగి, 18–35 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. రెజ్యూమ్, విద్యార్హతలు, ఆధార్ కార్డు ఫొటోస్టాట్ కాపీలతో 16న ఉదయం 9.30 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు 63648 67800 ఫోను నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఆధారాలతో నివేదిక సమర్పించండి

గుంటూరు డివిజన్ సహకారశాఖ అధికారి సేనారెడ్డి ఆదేశం

సాక్షి ఎఫెక్ట్

కొరిటెపాడు(గుంటూరు): 'సహకారంలో జీతాల కుంభకోణం' శీర్షికన ఈ నెల 10వ తేదీన సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన కథనంపై సహకార శాఖ డివిజనల్ అధికారి సేనారెడ్డి స్పందించారు. వివరణాత్మక నివేదిక సమర్పించాలని మండల ఇన్‌చార్జులను ఆదేశించారు. గుంటూరు డివిజన్‌లోని మండలాల్లో ఉన్న పీఏసీఎస్‌లకు కేటాయించిన మండల ఇన్‌చార్జులు సోమవారం సాయంత్రం 5 గంటలకు సహకార శాఖ డివిజన్ కార్యాలయానికి ఆధారాలతో వివరణాత్మక నివేదిక సమర్పించాలని ఆయన ఆదేశించారు. అలాగే సాక్షిలో ప్రచురితమైన కథనంపై రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ కూడా ఆరా తీసినట్లు సమాచారం.

చేబ్రోలులో ఐదుగురికి డయేరియా లక్షణాలు



చేబ్రోలు: గుంటూరు జిల్లా చేబ్రోలులోని పలు ప్రాంతాల్లో రెండు రోజులుగా వాంతులు, విరేచనాలు, జ్వరాల కేసులు అధికంగా నమోదు అవుతుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. చేబ్రోలులోని చెరువులోపాలెంలో శనివారం ఐదుగురికి డయేరియా లక్షణాలు కనిపించటంతో వైద్య సిబ్బంది అప్రమత్తం అయ్యారు. ఇంటింటి ఆరోగ్య సర్వే నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మెరుగైన చికిత్స అందజేస్తున్నారు. రెండు రోజులుగా వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు జ్వరాలబారిన పడ్డారు. ప్రభుత్వ వైద్యశాలలతో పాటు స్థానిక ఆర్ఎంపీలు, గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలల్లో కూడా వారు చికిత్స పొందుతున్నారు. చెరువులోపాలెంలో ఆహార కలుషితం కారణంగానే వాంతులు, విరేచనాలు బారిన పలువురు పడినట్లు పీహెచ్‌సీ అధికారులు తెలిపారు. పరిస్థితి అదుపులోనే ఉందని పేర్కొన్నారు.

సీఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయ సందర్శన



తాడికొండ: అమరావతిలో నిర్మించిన ఏపీ సీఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయాన్ని మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ శనివారం సందర్శించారు. ప్రాజెక్టు కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు ఆయనకు వివరించారు. కార్యక్రమంలో సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ ఎ. భార్గవ్ తేజ, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

కన్నకడుపు ఆక్రోశం

- జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారిపై ప్రశ్నల వర్షం కురిపిస్తూ మండిపడ్డ విద్యార్థుల తల్లిదండ్రులు
- ఇక్కడే ఉంచి మా పిల్లల్ని చంపుకోమంటారా ?
- పిల్లలు అస్వస్థతకు గురై ఊసురోమంటుంటే కనీసం సమాచారం కూడా ఇచ్చే తీరిక, బాధ్యత మీకు లేదా ?
- పిల్లలతో అంట్లు తోమిస్తారా, బల్లులు పడిన నీళ్లు తాగమంటారా ?
- వార్డెన్, కుక్ ఉంటే పిల్లల్ని ఇక్కడ ఉంచం
- వార్డెన్, కుక్‌లపై విస్తుపోయేలా ఆరోపణలు చేసిన విద్యార్థులు



పెదనందిపాడులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలోని వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్న అస్వస్థతకు గురైన విద్యార్థులు



శనివారం ఉదయం విద్యార్థులను 108లో జీజీహెచ్‌కి తరలిస్తున్న సిబ్బంది

ప్రత్తిపాడు: '' మేము ఎక్కడో వంద కిలోమీటర్ల దూరంలో ఉంటాం. ఇక్కడ మీరు ఉన్నారు. బాధ్యతగా ఉంటారనే కదా మా పిల్లల్ని మీ దగ్గర (హాస్టల్)లో వదిలేసి వెళ్లాం. ఆహారం కలుషితమై ఆస్పత్రిపాలైతే కనీసం మాకు సమాచారం ఇవ్వలేదు. ఇదేనా మీకు పిల్లలమీద ఉన్న బాధ్యత ? ఇక్కడ ఉంచి మా పిల్లల్ని మేం చంపుకోలేం'' అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు జిల్లా సంక్షేమశాఖ అధికారి మయూరిపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఇక్కడే ఉంచి మా పిల్లల్ని చంపుకోమంటారా.. అంటూ మండిపడ్డారు. పెదనందిపాడు మండలం అన్నపర్రులోని బీసీ బాలుర వసతి గృహంలో శుక్రవారం అస్వస్థతకు గురైన 54 మందిలో చికిత్స అనంతరం సాయంత్రానికి కొందరిని డిశ్చార్జ్ చేశారు. మరికొందరిని జీజీహెచ్‌కి రిఫర్ చేశారు. శిబిరంలో ఉన్న 24 మందిలో నలుగురిని అదేరోజు రాత్రి జీజీహెచ్‌కి తరలించారు. శనివారానికి కూడా మరో ఐదుగురికి కడుపునొప్పి తగ్గకపోవడం, బీపీ డౌన్ అవుతుండటంతో 108 వాహనంలో గుంటూరు సమగ్ర వైద్యశాలకు తరలించారు. ఇంకా శిబిరంలో 15 మంది చికిత్స పొందుతున్నారు. మొత్తం మీద గుంటూరు జీజీహెచ్‌లో 26 మంది విద్యార్థులు చికిత్స పొందుతున్నట్లు వైద్యాశాఖ అధికారులు తెలిపారు.

ఫోన్ చేసే బాధ్యత లేదా ?

తమ పిల్లలు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం ఉదయానికి అన్నపర్రులోని బీసీ హాస్టల్‌కు చేరుకున్నారు. అక్కడ ఉన్న తమ పిల్లలతో మాట్లాడారు. సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఇంతలో అక్కడకు జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి మయూరి వచ్చారు. దీంతో ఆమెపై విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నాస్త్రాలు సంధించారు. ఇంతటి ఘటన జరిగితే కనీసం తమకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని మండిపడ్డారు. ఒక్క ఫోన్ చేసే తీరిక మీ వార్డెన్‌కు గానీ సిబ్బందికి, అధికారులకు లేదా? అని ప్రశ్నించారు. ఇంతటి నిర్లక్ష్యం ఏమిటని, ఇంత బాధ్యతారాహిత్యంగా ఎలా ఉంటారని? ఆగ్రహించారు. ''ప్రస్తుత పరిస్థితుల్లో హాస్టల్లో మా పిల్లలను ఉంచలేమని, మాతో ఇంటికి తీసుకువెళ్లిపోతా''మని బీసీ సంక్షేమశాఖ అధికారి మయూరికి తల్లిదండ్రులు తేల్చిచెప్పారు. స్పందించిన ఆమె అలా పంపించడానికి కలెక్టర్ పర్మిషన్ ఇవ్వలేదన్నారు. ఇప్పుడు పిల్లల్ని తీసుకుని వెళితే మొత్తానికే తీసుకెళ్లిపోవడమేనని, ఇక మళ్లీ హాస్టల్‌కు రావడం ఉండదు.. స్కూల్‌కు వెళ్లడం ఉండదంటూ బెదిరింపు ధోరణిలో యమూరి సమాధానమిచ్చారు. దీంతో తల్లిదండ్రుల్లో ఆగ్రహం కట్టలు తెచ్చుకుంది. ఇక్కడ ఉంచి మా పిల్లల్ని చంపుకోలేమని తల్లిదండ్రులు నిప్పులు చెరిగారు. వెంటనే ఇక్కడి నుంచి వార్డెన్‌ను, కుక్‌ను తొలగించేస్తామని, ఇకపై ఎలాంటి ఇబ్బందులుండవని మయూరి తల్లిదండ్రులకు హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

మా పిల్లల్ని మాతో పంపించండి !

ఇదిలా ఉంటే ప్రత్యేక వైద్య శిబిరం వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. కల్యాణ మండపంలో బల్లలపై నొప్పులతో బాధపడుతూ చికిత్స పొందుతున్న తమ పిల్లలను చూసి తల్లిదండ్రులు చలించిపోయారు. ''అయ్యా.. మీకు పుణ్యముంటది.. మా పిల్లలను మాతో పంపించండి. మేము తీసుకువెళ్లి చికిత్స చేయించుకుంటా''మంటూ నెత్తీనోరూ బాదుకున్నారు. శుక్రవారం ఉదయం నుంచి ఉన్నా కొందరికి శనివారం వరకు కూడా నొప్పులు తగ్గకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురై తమ వెంట తీసుకువెళతామంటూ పట్టుబట్టారు. అయితే, అందుకు కలెక్టర్ అనుమతి కావాలంటూ అధికారులు తల్లిదండ్రులకు నచ్చజెప్పారు.

బూతులు తిడతారు.. రూమ్‌లో కోటింగ్ ఇస్తారు !

హాస్టల్ విద్యార్థులు శనివారం జిల్లా సంక్షేమ అధికారి మయూరి ఎదుట విస్తుపోయే వాస్తవాలను వెల్లడించారు. హాస్టల్ వార్డెన్ విపరీతంగా బూతులు తిడతారని, మాతోనే అంట్లు తోమిస్తారని, భోజనం అస్సలు బాగుండదని వాపోయారు. ఇదే విషయాన్ని పిర్యాదు చేసినా, ఎవ్వరైనా వచ్చినప్పుడు చెప్పినా.. ఆ తరువాత మమ్మల్ని రూమ్‌లోకి తీసుకువెళ్లి ఇష్టమొచ్చినట్లు కొడతారని మయూరి ఎదుట ఆరోపించారు. అంట్లు, వంటపాత్రలు కూడా కడిగిస్తారని చెప్పారు. ఇడ్లీ పాత్రలో బల్లి పడితే ఆ పాత్రలు శుభ్రం చేయకుండానే పెట్టారని, పాలల్లో కూడా బల్లి పడిందని పిర్యాదు చేశారు. ఇవన్నీ అడిగితే కర్ర తీసుకుని కొడుతున్నారని, ఎవ్వరికైనా చెబితే టీసీలిస్తామంటూ బెదిరిస్తున్నారని కన్నీటి పర్యంతమవుతూ విద్యార్థులు వాపోయారు. దీంతో చలించిపోయిన తల్లిదండ్రులు పిల్లలతో అంట్లు తోమించడం, బల్లి పడ్డ నీళ్లు తాగించడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు.



కన్నీటి పర్యంతమవుతూ వార్డెన్ వేధింపులను జిల్లా సంక్షేమశాఖ అధికారికి వివరిస్తున్న విద్యార్థులు

మీకో దండం.. మీ హాస్టల్‌కో దండం !

హాస్టల్‌లో పరిస్థితులు సరిగాలేకపోవడంతో ఆందోళనకు గురైన విద్యార్థులు ఇంటిబాట పట్టారు. కొందరు ఉదయాన్నే బ్యాగులు సర్దుకుని హాస్టల్ నుంచి ఇళ్లకు వెళ్లిపోగా, మరికొందరిని తల్లిదండ్రులు తీసుకు వెళ్లిపోయారు. సుమారు 23 మంది విద్యార్థులు హాస్టల్లో ఉండలేమంటూ వెళ్లిపోయారు. అనంతరం హాస్టల్‌కు చేరుకున్న బీసీ సంక్షేమశాఖ అధికారి మయూరి వార్డెన్ మార్కండేయులుతో పాటు, ఏబీసీడబ్ల్యూపై మండిపడ్డారు. ''ఇది హాస్టల్ అనుకుంటున్నారా.. లేక మీ ఇళ్లు అనుకుంటున్నారా..? పిల్లల్ని ఎవ్వరి అనుమతితో ఇంటికి పంపించారు..?'' అంటూ సిబ్బందిపై ఫైర్ అయ్యారు. వెంటనే వెళ్లిన పిల్లల తల్లిదండ్రులకు ఫోన్లు చేసి వెనక్కు రప్పించాలని, మిగిలిన పిల్లలు ఎక్కడెక్కడున్నారో వెతికి పట్టుకుని హాస్టల్‌కు తీసుకురావాలని ఆదేశించారు.



హాస్టల్ నుంచి ఇళ్లకు వెళ్లిపోతున్న విద్యార్థులు

గెలుపే లక్ష్యంగా ముందుకుసాగాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల: క్రీడల తరహాలో జీవితంలోనూ గెలుపు లక్ష్యంగా పోటీతత్వంతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. ఏడవ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా జిల్లా స్థాయి ఎంపిక పోటీలు శనివారం స్థానిక బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో మొదలయ్యాయి. రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ పోటీలను ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. జాతీయ జెండాను కలెక్టర్ ఎగురవేయగా, రెవెన్యూ అసోసియేషన్ జెండాను సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ బాబు ఆవిష్కరించారు. తదుపరి వాలీబాల్, కబడ్డీ, కుర్చీలాట, చదరంగం, క్యారమ్స్ పోటీలను తిలకించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలలో గెలుపొందిన వారికి బాపట్లలో మంచి అవకాశాలు కల్పిస్తామని ప్రోత్సహించారు. పాఠశాల విద్యార్థిగా కర్ణాటక రాష్ట్రం సౌత్ జోన్ పరిధిలో క్రికెట్ ఆడానని, పదో తరగతిలో బాస్కెట్ బాల్ జిల్లా బృందంలో సభ్యుడిగా ఉన్నానంటూ తన అనుభవాలను మననం చేసుకున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల పురోగతిలో రెవెన్యూ ఉద్యోగుల బాధ్యత చాలా కీలకమని బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా చెప్పారు. క్రీడాకారులు పతకాలు సాధించాలని చీరాల ఆర్డీవో టి.చంద్రశేఖర్ తెలిపారు. గెలుపోటములు పక్కనపెట్టి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి తెలిపారు. జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు సి.హెచ్. సురేష్ బాబు, ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ ముప్పలనేని శ్రీనివాసరావు, కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.విజయమ్మ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి కె.పాల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

ఆరోగ్యం కుదుటపడ్డాకే విద్యార్థుల డిశ్చార్జి

టెలీ కాన్ఫరెన్స్‌లో మంత్రి సవిత

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అన్నపర్రు బీసీ హాస్టల్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారి ఆరోగ్యం పూర్తిగా మెరుగయ్యాకే డిశ్చార్జి చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. హాస్టల్ విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులపై బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణతో మంత్రి సవిత శనివారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణను అడిగి తెలుసుకున్నారు. 60 మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలతో ఆసుపత్రిలో చేరగా, ప్రస్తుతం 24 మంది మాత్రమే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ఒక విద్యార్థి ఐసీయూలో చికిత్స అందజేస్తున్నామని జీజీహెచ్ సూపరింటెండెంట్ వివరించారు. ఆ విద్యార్థి ఇంతకుముందు నుంచే కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండడంతో ఐసీయూలో వైద్యమందిస్తున్నామని తెలిపారు. మరో ఇద్దరు విద్యార్థులు పెదనందిపాడు కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. మిగిలిన విద్యార్థులను ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశామన్నారు. మంత్రి సవిత స్పందిస్తూ, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆరోగ్యం పూర్తిగా కుదుటపడిన తరవాతే ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై గంటకు గంటకూ అప్ డేట్ ఇవ్వాలని స్పష్టం చేశారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న విద్యార్థిని తక్షణమే ఎయిమ్స్‌కు తరలించాలని మంత్రి సవిత ఆదేశించారు.



వైద్యుల పర్యవేక్షణ తప్పనిసరి

డిశ్చార్జి అయిన వారితో పాటు హాస్టల్‌లో మిగిలిన విద్యార్థులను వైద్యుల పర్యవేక్షణలో ఉంచాలని బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణను, డైరెక్టర్ మల్లికార్జునను మంత్రి సవిత ఆదేశించారు. హాస్టల్‌లో అపరిశుభ్రతపై తీసుకున్న చర్యల గురించి డీబీసీడబ్ల్యూవో మయూరిని అడిగి తెలుసుకున్నారు. కాచి చల్లార్చిన నీటితోపాటు తాజా ఆహారమే వారికి అందివ్వాలన్నారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ చల్లాలన్నారు. హాస్టల్ పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఘటనలు పునరావృతం కానివ్వొద్దు

అన్నపర్రు బీసీ హాస్టల్ ఘటన రాష్ట్రంలో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సవిత ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో నిరంతరం అప్రమత్తంగా ఉండేలా వార్డెన్లను ఆదేశించాలన్నారు. డీబీసీడబ్ల్యూవోలు తమ పరిధిలో హాస్టళ్లను నిరంతం పర్యవేక్షించాలని తెలిపారు. హాస్టళ్లలో వార్డెన్లు ఉండేలా చూడాలన్నారు. బయట ఆహారం తీసుకుని రాకూడదని ఆదేశించారు.

ఇసుక మాయం.. కృష్ణమ్మకు శోకం

- నదిలో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు
- ప్రేక్షకపాత్రకే పరిమితమైన పోలీసు, రెవెన్యూ యంత్రాంగం
- జేబులు నింపుకొంటున్న కూటమి నేతలు



గాజుల్లంక వద్ద కృష్ణా నదిలో నీటి మధ్యలోనే ట్రాక్టర్లలో ఇసుక లోడింగ్

కృష్ణానదిలో ఇసుక అక్రమ తవ్వకాల వ్యవహారం ఎక్కువైంది. తవ్వకాలను నిలువరించేందుకు పోలీసు, రెవెన్యూ యంత్రాంగంతో బృందాలు ఏర్పాటు చేసినా ఇసుకాసురులు ట్రాక్టర్ల ద్వారా యథేచ్ఛగా ఇసుక తీసుకెళుతున్నారు. భారీ సంఖ్యలో ట్రాక్టర్లు నదిలోకి ప్రవేశించినా పోలీసు, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు.

కొల్లూరు: కూటమి ప్రభుత్వానికి చెందిన నాయకులు కృష్ణానదిలో ఇష్టానుసారంగా ఇసుకను తవ్వి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. శనివారం మండలంలోని గాజుల్లంక వద్ద ఇతర ప్రాంతాలకు చెందిన ట్రాక్టర్లు వందల సంఖ్యలో నదిలో నీటి మధ్యన ఇసుక తవ్వకాలు చేపట్టడం వివాదాస్పదమైంది. గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు నదిలో ఇసుక తవ్వకాలపై నిషేధం కొనసాగుతోంది. ఈ తరుణంలో రెవెన్యూ, పోలీసు బృందాలను ఈ తవ్వకాలను అరికట్టేందుకు ఏర్పాటు చేశారు. తీర గ్రామాలకు చెందిన వ్యక్తులను సైతం గృహ నిర్మాణ అవసరాలకు ఇసుక తరలింపుపై అధికారులు ఆంక్షలు పెట్టారు. ట్రాక్టర్ల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో స్థానికంగా ఆగ్రహం వ్యక్తమైంది. అధికారుల కళ్లెదుటే నదిలోకి ట్రాక్టర్లు వెళ్లినా పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉచిత ఇసుక సాకుతో భారీ సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా వాల్టా వంటి చట్టాలను అతిక్రమించి తవ్వకాలు చేపడుతున్నారని మండిపడ్డారు. కూటమి నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి.

కేసులు కూడా శూన్యం

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న ట్రాక్టర్లను ఎప్పుడైనా స్వాధీనం చేసుకున్నా, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేయడం లేదు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లను శనివారం పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్రమ రవాణాదారులతో అధికారులు కుమ్మక్కయ్యారని సమాచారం.

ట్రాక్టర్లు దిగకుండా పికెట్

కృష్ణా నదిలో ఇసుకను అక్రమంగా తవ్వి తరలించకుండా పోలీసు పికెట్ ఏర్పాటు చేశాం. ఉదయం వేళ అధికారుల బృందాలను లెక్క చేయకుండా నదిలోకి ట్రాక్టర్లు దిగాయి. ఇసుక లోడింగ్ చేస్తున్న సమాచారంతో సిబ్బందితో వెళ్లేసరికి ఇసుక అన్‌లోడ్ చేసి ట్రాక్టర్లతో పరారయ్యారు. ఇకపై తవ్వకాలు చేపడితే కేసులు తప్పవు.

– జానకి అమరవర్ధన్, ఎస్ఐ, కొల్లూరు

రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలు ప్రారంభం



చీరాల రూరల్: చీరాల హైస్కూలు రోడ్డులోని మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో 29వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా జూనియర్ బాల, బాలికల పోటీలు శనివారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలను ముఖ్య అతిథిగా సెపక్‌తక్రా జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ వైద్యుల విభాగ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఇస్తర్ల బాబురావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ క్రీడకు బాపట్ల జిల్లాలో తగిన ప్రాధాన్యం లేదని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలతో భవిష్యత్తులో ఆదరణ లభిస్తుందన్నారు. మొదటి రోజు పోటీల్లో ఆయా జిల్లాల క్రీడాకారులు ప్రథమ, ద్వితీయ స్థానాల కోసం ఎంతో శ్రమించారన్నారు. ఆదివారం కూడా ఇవి కొనసాగనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పొత్తూరి సుబ్బయ్య, వన్ టౌన్ సీఐ సుబ్బారావు, ఇస్తర్ల సుభాషిణి, క్రీడాకారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌ను అవమానిస్తే సహించం

వైఎస్సార్ సీపీ నాయకుల హెచ్చరిక

చీరాల: వైఎస్సార్‌ను కించపరిస్తే ఊరుకోబోమని వైఎస్సార్‌సీపీ నేతలు హెచ్చరించారు. నూతనంగా ఏర్పాటు చేయనున్న గడియార స్తంభం విషయమై వైఎస్సార్ విగ్రహం వద్ద మెట్లు, స్టీలు రెయిలింగ్‌ను తొలగించాలంటూ మున్సిపల్ చైర్మన్ తీసుకున్న నిర్ణయాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. శనివారం చీరాలలో మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. వైఎస్సార్ విగ్రహం వద్ద గల కూడలిలో గడియార స్తంభం నిర్మాణం గురించి రెండు రోజుల క్రితం మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు స్థానిక కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారన్నారు. గతంలో ప్రతిపాదించిన రెండు అంశాలను కాకుండా మూడో అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారని తెలిపారు. వైఎస్సార్ అభిమానుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా విగ్రహాన్ని అనుకొని ఉన్న మెట్లను, స్టీలు రాడ్లు తొలగించే ప్రయత్నాన్ని వైఎస్సార్‌సీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. గతంలో కౌన్సిల్‌లో తీర్మానం చేసి ఏఆర్ఎం కాంప్లెక్స్‌పైన 25 అడుగుల గడియార స్తంభం నిర్మించేందుకు టెండర్ పిలిచారన్నారు. దానిని ముందుకు తీసుకెళ్లే క్రమంలో వ్యతిరేకించిన వ్యక్తి ఇప్పుడున్న చైర్మన్ కాదా అని ప్రశ్నించారు. రెండు సార్లు వైఎస్సార్ సీపీ బీ–ఫాంపై గెలిచి నేడు వైఎస్సార్ సీపీ తరఫున కౌన్సిలర్‌గా ఉండి ప్రతిపాదించిన వ్యక్తులు టీడీపీ కండువా కప్పుకోవడం సిగ్గుచేటన్నారు. గతంలో కారంచేడు గేటు సెంటర్‌లో కూడా వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు విషయంలో ఏం జరిగిందో అందరికీ తెలుసన్నారు. కౌన్సిల్ ఆమోదించిన దానిని కాకుండా మరోలా చేయాలని చూస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు యాతం మేరిబాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గవిని శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వాసిమళ్ళ వాసు, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కోడూరి ప్రసాద్‌రెడ్డి, బీసీ సెల్ మెంబర్ గోలి గిరి, పట్టణ ప్రధాన కార్యదర్శి చిరంజీవి మాస్టర్, లీగల్ సెల్ సభ్యులు రాజు వెంకటేశ్వర రెడ్డి, వేటపాలెం మండల అధ్యక్షుడు సాధు రాఘవ రావు, మాజీ అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, రైతు విభాగం చైర్మన్ కావూరి రమణారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగా మహేష్, కౌన్సిలర్లు బత్తుల అనిల్, కంపా అరుణ్, చీమకుర్తి బాలకృష్ణ, మహిళా నాయకులు ప్రసన్న, పార్టీ నాయకులు రాజ్‌కుమార్, చెల్లి బాబూ రావు, కె.పూర్ణ, కె.చిట్టిబాబు, వెంకటరావు, టి.వినయ్, జంగా ప్రేమ్, బాలకోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో వైఎస్సార్ సీపీ నేతలు

క్లుప్తంగా

తెగిపడిన విద్యుత్ వైర్లకు మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్

మార్టూరు: మండలంలోని వలపర్ల గ్రామంలో శుక్రవారం తెగిపడిన విద్యుత్ వైర్ల గురించి శనివారం సాక్షిలో వచ్చిన కథనంపై కలెక్టర్ వి.వినోద్ కుమార్ స్పందించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో మార్టూరు విద్యుత్ శాఖ ఏఈ జీవీ ఆంజనేయులు, సబ్ ఇంజినీర్ కిరణ్‌కుమార్ ఇతర సిబ్బంది వలపర్ల సినిమా హాల్ సెంటర్‌కు శనివారం సాయంత్రం వెళ్లి విద్యుత్ స్తంభాలను, వైర్లను పరిశీలించారు. నూతనంగా ఏర్పాటు చేయడానికి అవసరమైన మెటీరియల్ కోసం ప్రణాళిక తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా గ్రామస్తులు విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం తమ గ్రామంలో జరిగిన సంఘటన సాక్షి వెలుగులోకి తీసుకురావడం, కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో హర్షం వ్యక్తం చేశారు. అయితే గ్రామంలో ఏ వీధిలో చూసినా ఇలాంటి సమస్యలే ఉన్నాయని తద్వారా ప్రమాదాలు పొంచి ఉన్నాయని వాపోయారు.

టైరు పగిలి కారు బోల్తా



జె.పంగులూరు: వేగంగా వస్తున్న కారు టైరు పగిలి బోల్తా పడిన సంఘటన ముప్పవరం జాతీయ రహదారిపై శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. విజయవాడ నుంచి నెల్లూరుకు కారులో నలుగురు ప్రయాణిస్తున్నారు. ముప్పవరం జాతీయ రహదారి ఫ్లైఓవర్ ఎక్కే సమయంలో టైరు పగిలి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారిలో ఎం. బాబూరావు, సీహెచ్. అనిల్‌కుమార్ గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది వారిని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రేణింగవరం ఎస్సై వినోద్‌బాబు, బీట్ సిబ్బంది ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

కూలిన ఆలేరు రిటైనింగ్ వాల్



ఉధృతంగా ప్రవహిస్తున్న ఆలేరు వాగు



వర్షం ఉధృతి కారణంగా కూలిన ఆలేరు రిటైనింగ్ వాల్

ఇంకొల్లు(చినగంజాం): మండలంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఆలేరు సర్‌ప్లస్‌కు సంబంధించిన రిటైనింగ్ వాల్ కూలిపోయింది. నాలుగు సంవత్సరాల క్రితం వచ్చిన వర్షపు నీటి ఉధృతి కారణంగా ఒక రిటైనింగ్ వాల్ కూలిపోయింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రెండో రిటైనింగ్ వాల్ శుక్రవారం రాత్రి కూలిపోయింది. రెండువైపులా రిటైనింగ్ వాల్ కూలిపోవడంతో ఆలేరు సర్‌ప్లస్ ప్రమాదంలో పడింది. ప్రస్తుతం వర్షపు నీరు ఉధృతంగా ప్రవస్తోంది. ఇప్పటికైనా ఆర్ అండ్ బీ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

యూపీఐ మోసాలపై అప్రమత్తత అవసరం

ఎస్పీ బి. ఉమామహేశ్వర్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

బాపట్ల టౌన్: యూపీఐ మోసాలపై వ్యాపారస్తులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మినిస్ట్రీ ఆఫ్ హోమ్ ఎఫైర్స్ 14సీ (ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్) నిర్వాహకులు అక్టోబర్‌ను సైబర్ నేరాల అవగాహన మాసంగా ప్రకటించారని తెలిపారు. దానిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేకంగా యూపీఐ పేమెంట్స్ పేరుతో జరుగుతున్న సైబర్ మోసాల గురించి ప్రజలు, వ్యాపారస్తులకు అవగాహన కల్పించడానికి జిల్లా పోలీస్ అధికారులు కృషి చేస్తున్నట్లు తెలిపారు. తమ పరిధిలోని మార్కెట్లలో, వ్యాపార సముదాయాల్లో ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వివరించారు. దుకాణదారులు అపరిచిత వ్యక్తులకు యూపీఐ పిన్ నమోదు సంఖ్య చెప్పవద్దని ఎస్పీ సూచించారు. ఒక్కసారి సైబర్ నేరస్తుల వలలో పడితే పోయిన డబ్బులను తిరిగి పొందడం చాలా కష్టమని చెప్పారు. స్మార్ట్ ఫోన్లలో పేమెంట్ యాప్‌లను ఉపయోగించి సులభంగా లక్షల్లో లావాదేవీలు కూడా క్షణాల్లో చేసేస్తున్నారని పేర్కొన్నారు. తెలియని వ్యక్తులు దుకాణాలకు వచ్చి వస్తువులు కొనుగోలు చేసి ఫోన్‌పే, గూగుల్ పే చేస్తామని చెబుతారన్నారు. ముందుగా రూ.1 పంపి తర్వాత యూపీఐలో మనీ రిక్వెస్ట్ పంపి ఖాతాలో మొత్తం డబ్బుని దొంగిలిస్తున్నారని ఎస్పీ వివరించారు. ఎట్టి పరిస్థితులలోనూ ఫోన్ ఇతరులకు ఇవ్వకూడదని, సైబర్ మోసానికి గురైనట్లు గ్రహిస్తే వెంటనే హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేయాలని సూచించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



చిట్టిబాబు మృతదేహం

బాపట్ల టౌన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం ఉదయం మచ్చావారిపాలెం సమీపంలోని 216 జాతీయం^హదారిపై చోటుచేసుకుంది. కర్లపాలెం గ్రామానికి చెందిన బొద్దులూరి చిట్టిబాబు(45) సైకిల్‌పై బాపట్ల మండలం చింతావారిపాలెంలో నివాసం ఉంటున్న పిన్ని వద్దకు వెళ్తున్నాడు. అదే సమయంలో అటుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్ఐ విజయ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఆవు కడుపులో 55 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలు



కొల్లూరు : ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించడంతో కూటమి ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. విచ్చల విడిగా వినియోగిస్తున్న క్యారీ బ్యాగ్‌ల కారణంగా ఓ మూగ జీవి ప్రాణాల మీదకు వచ్చిన సంఘటన కొల్లూరులో చోటు చేసుకుంది. కొల్లూరు గాడపాలేనికి చెందిన మార్గన బాలాజీ రెండు నెలల కిందట రేపల్లె నుంచి వీధుల్లో తిరిగే ఆవును కొనుగోలు చేసి పోషిస్తున్నాడు. నెల రోజుల కిందట దూడ కూడా పుట్టింది. అయితే, ఆవు మేత తినకుండా మందకొడిగా ఉంటోంది. ఆందోళనకు గురైన యజమాని కొల్లూరు పశువైద్యాధికారిని సంప్రదించాడు. శనివారం గోవును పరిశీలించిన పశువైద్యాధికారి యశ్వంత్ పొట్ట గట్టిగా రాయిలా ఉండటంతో అనుమానం వచ్చి శస్త్ర చికిత్స చేశారు. గంటల కొద్దీ శ్రమించి కడుపులో ఉన్న 54.70 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. అనంతరం ఆవు ప్రాణాపాయ స్థితి నుంచి సాధారణ స్థితికి చేరుకోవడంతో వైద్యాధికారిని స్థానికులు అభినందించారు.

క్రోసూరులో ఇంటిపై పడిన పిడుగు

- స్లాబ్ దిమ్మె, వరండాకు పగుళ్లు
- విద్యుత్ పరికరాలు ధ్వంసం



క్రోసూరు: పిడుగుపాటులో ఇంటి స్లాబ్ పాక్షికంగా ధ్వంసమైన ఘటన శనివారం వేకువజామున చోటుచేసుకుంది. క్రోసూరులోని కటకం కల్యాణ మండపం ఎదురు బజారు(కొత్తూరు)లో షేక్ నాగూరు ఉంటున్నాడు. తెల్లవారుజామున ఇంటిపై పిడుగు పడింది. దాని ధాటికి ఇంటి వరండా స్లాబ్ బీటలు వారింది. విద్యుత్ మీటర్ కాలిపోయింది. ఫ్రిజ్, ఫ్యాన్లు, వాషింగ్ మిషన్లు పూర్తిగా పాడయ్యాయి. ఇంటి ముందున్న విద్యుత్ స్తంభం తీగలు తెగిపడిపోయాయి. అంతేకాకుండా అదే వీధిలోని అనేక మంది ఇళ్లలో విద్యుత్ పరికరాలు, నీళ్ల మోటార్లు, టీవీలు పాడయినట్లు స్థానికులు తెలిపారు. ఘటనా స్థలాన్ని మాజీ శాసనసభ్యుడు నంబూరు శంకరావు సందర్శించి, బాధితుడిని పరామర్శించారు. వీఆర్వో లేళ్ల బ్రహ్మనాయుడు బాధితుడి నుంచి వివరాలు సేకరించారు.

మహిళలు సంఘటితంగా ఉద్యమించాలి



మంగళగిరి టౌన్: మహిళలు శ్రమ దోపిడీకి గురవుతున్నారని, దీనికి వ్యతిరేకంగా సంఘటితంగా ఉద్యమించాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డి. శ్రీనివాసకుమారి పిలుపునిచ్చారు. మంగళగిరి నగర పరిధిలోని ఐద్వా కార్యాలయంలో శనివారం గుంటూరు జిల్లా 12వ మహాసభను నిర్వహించారు. ఐద్వా జెండాను ఆవిష్కరించిన అనంతరం శ్రీనివాసకుమారి మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలపై మహిళలు ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలని చెప్పారు. తొలుత మహిళా ఉద్యమంలో అమరులైన మల్లు స్వరాజ్యం, మోటూరు ఉదయం, మానికొండ సూర్యావతి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రామిక జిల్లా మహిళా కన్వీనర్ అరుణ, ఐద్వా జిల్లా నాయకురాలు సుధా కిరణ్, జిల్లా మాజీ కార్యదర్శి ప్రమీల, మంగళగిరి రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు సంధ్య, విజయలక్ష్మి, సభ్యులు పద్మ, గిరిజ, కల్యాణి పాల్గొన్నారు.

జిల్లా ఐద్వా కమిటీఎంపిక

మహాసభలో గుంటూరు జిల్లా ఐద్వా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కె. పద్మ, కార్యదర్శిగా అరుణ, సహాయ కార్యదర్శులుగా గిరిజ, సుమ, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసకుమారితో పాటు 15 మందితో కమిటీ ఎన్నికైంది.

సంక్షేమ పథకాలకు రూ. 47వేల కోట్లు ఖర్చు

కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్



చక్రాయపాలెంలో కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు పెమ్మసాని, మనోహర్

కొల్లిపర: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో రూ. 47 వేల కోట్లను సంక్షేమ పథకాలకు ఖర్చు చేశామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మండలంలోని చక్రాయపాలెంలో శనివారం రూ.81 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ (కల్యాణ మండపం) ప్రారంభంతో పాటు అత్తోటలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలసి శంకుస్థాపన చేశారు. కేంద్ర మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ ఎన్నికల్లో తనకు 95 శాతం ఓట్లు వేసి గెలిపించిన ఏకైక గ్రామం చక్రాయపాలెమని కొనియాడారు. కల్యాణ మండపం చుట్టూ కాంపౌండ్ వాల్, డొంక రోడ్డు , డ్రెయినేజీలు నిర్మాణ సమస్యలను గ్రామస్తులు తన దృష్టికి తీసుకు వచ్చినట్లు తెలిపారు. ఎంపీ నిధులు నుంచి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి, విద్యుత్ ట్రాన్స్‌ఫారం కోసం రూ.13 లక్షలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. మిగిలిన సమస్యల్ని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర మంత్రి మనోహర్ మాట్లాడుతూ రాబోవు 15 రోజుల్లో దేశంలో ఎన్నడూ లేని విధంగా విశాఖపట్టంలో గూగుల్ సంస్థ రూ.87 వేల కోట్లతో డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం సహాయ, సహకారాలు అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో చందు నాగేశ్వరరావు, అమ్మిశెట్టి హరికృష్ణ, సీతారామయ్య, హరికృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు ప్రారంభం



పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎగ్జామినేషన్ సెక్రటరీ ప్రభాకరరావు



పోటీలో తలపడుతున్న క్రీడాకారిణిలు

రేపల్లె: క్రీడలతో శారీరక దృఢత్వమే కాకుండా మానసికోల్లాసం, సంపూర్ణ ఆరోగ్యాలు చేకూరతాయని బాపట్ల జిల్లా కామన్ ఎగ్జామినేషన్ సెక్రటరీ కొచ్చెర్ల ప్రభాకరరావు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, విద్యాశాఖల సంయుక్త ఆధ్వర్యంలో 16వ రాష్ట్రస్థాయి అండర్-14 బాల బాలికల తైక్వాండో పోటీలు మండలంలోని పేటేరు జడ్పీ హైస్కూలులో శనివారం ప్రారంభమయ్యాయి. పాఠశాలలో జెండా వందనం చేసి పోటీలను ప్రభాకరరావు ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో రాణించే వారికి మంచి గుర్తింపుతో పాటు బంగారు భవిష్యత్ లభిస్తుందని చెప్పారు. కేవలం చదువుకే పరిమితం కాకుండా విద్యార్థులు ఆటపాటల్లో రాణించాలని తెలిపారు. పోటీలకు ఉమ్మడి 13 జిల్లాల నుంచి జిల్లాకు 20 మది చొప్పున 260 మంది క్రీడాకారులు హాజరయ్యారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాపూజీ, సర్పంచ్ కనపర్తి వసుమతి, ఎస్ఎంసీ చైర్మన్ వీర్లంకయ్య, బాపట్ల జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ కె.వెంకటేశ్వరరావు, రాష్ట్ర పరిశీలకులు దేవేంద్రనాథ్, నాయకులు గోలి రామశేషగిరిరావు, శాస్త్రి, పర్చూరు శ్యామ్‌ప్రసాద్, రావు ప్రభాకరరావు, కనపర్తి రవికిరణ్, వివిధ పాఠశాలల పీఈటీలు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సమన్వయంతో ఉత్తమ సేవలు అందించాలి

- జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు
- జిల్లా పోలీసు కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు

నరసరావుపేట రూరల్: పోలీస్ సిబ్బంది సమన్వయంతో ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు పేర్కొన్నారు. సెప్టెంబర్ నెల నేర సమీక్ష సమావేశం శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజలకు సత్వర, నాణ్యమైన సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి ఎస్పీ కృష్ణారావు దిశానిర్దేశం చేశారు. పోలీసు సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. పోలీస్‌స్టేషన్ రిసెప్షన్‌లో నైపుణ్యం కలిగిన సిబ్బందిని నియమించి, ఫిర్యాదుతో వచ్చే ప్రజలతో మర్యాదతో వ్యవహరించి, బాధ్యతతో పరిష్కరించాలని పేర్కొన్నారు. పీజీఆర్ఎస్‌లో అందిన ఫిర్యాదులను సమయానుకూలంగా, నాణ్యమైన రీతిలో పరిష్కరించాలన్నారు. మహిళల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, అవసరమైతే వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని తెలిపారు. 60, 90రోజుల్లో దర్యాప్తు పూర్తి చేయాల్సిన కేసులను వేగంగా పూర్తిచేసి, న్యాయస్థానంలో ప్రాథమిక చార్జిషీట్ సమర్పించాలని స్పష్టం చేశారు. మహిళా పోలీసుల సహకారంతో శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రాత్రి గస్తీ వ్యవస్థను పటిష్టం చేయాలని ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్ ఫోన్ డ్రైవింగ్‌తోపాటు బహిరంగ ప్రాంతాల్లో మద్యం తాగే వారిపై కేసులు నమోదు చేయాలని తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో పల్లె నిద్ర, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. బాణసంచా విక్రయ దుకాణాలను పరిశీలించి అనుమతి లేని విక్రయదారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(అడ్మిన్) జేవి సంతోష్, అదనపు ఎస్పీ(క్రైమ్) లక్ష్మీపతి, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగం పరిరక్షణే యూటీఎఫ్ లక్ష్యం



ఎన్ఎంఎంఎస్ పరీక్ష మోడల్ టెస్టు బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

మధ్యంతర కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు

నరసరావుపేట: ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సంక్షేమం యూటీఎఫ్ లక్ష్యమని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఓ ప్రైవేటు స్కూలులో ఏర్పాటు చేసిన మధ్యంతర కౌన్సిల్ సమావేశానికి జిల్లా అధ్యక్షులు పి.శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. ప్రారంభ సూచికగా ఎస్‌టీఎఫ్ఐ పతాకాన్ని పూర్వ ప్రధాన కార్యదర్శి జి.విజయసారథి, యూటీఎఫ్ పతాకాన్ని సీనియర్ నాయకులు ఎ.నాగేశ్వరరావు ఆవిష్కరించారు. పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మోహనరావు కార్యదర్శి నివేదిక ప్రవేశ పెట్టారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ ధ్యేయంగా పని చేయాలని తెలిపారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని వేసవి సెలవుల్లో విస్తృత ప్రచారం చేశామన్నారు. పాఠశాలలో విద్యార్థులు ఉంటేనే ఉపాధ్యాయులు ఉంటారని, అవసరమైతే అదనంగా పనిచేసి ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు కట్టుబడి ఉంటామన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ అగ్రభాగాన ఉండి పోరాడి సమస్యలు పరిష్కారానికి కృషి చేశామన్నారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలలో రెండు డీఏలను తక్షణమే విడుదల చేసి 30 శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. పీఆర్సీ కమిషన్ నియమించాలని మెమో నెం.57అమలు, 2003 డీఎస్సీ అభ్యర్థులకు ఓపీఎస్ అమలు చేయాలని, బోధనేతర పనులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగంలో 2021లో ఐదేళ్ల కాలానికి ప్రపంచబ్యాంక్‌తో ఆంధ్ర సపోర్టింగ్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఒప్పందం చేసుకుని రూ.1860 కోట్ల అప్పు తీసుకున్నారన్నారు. ఈ పథకం ద్వారా విద్యార్థులను అంతర్జాతీయ విద్యార్థిగా తయారు చేయడం, నాణ్యమైన విద్య అందించడం కాగా లక్ష్యాన్ని నీరుగారుస్తూ ఆన్‌లైన్‌లో సమాచారాన్ని పంపించే పాఠశాలలుగా మార్చారన్నారు. విద్యకు బడ్జెట్‌లో కోత విధించడంతో, విద్యార్థులు, పాఠశాలల సంఖ్య తగ్గి విద్యార్థుల సామర్థ్యాలు తగ్గాయన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవడం కోసం ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడి లేకుండా పని చేయడానికి సాల్టు పథకం రద్దు చేయాలని, దీనికై సామాజిక పోరాటం చేయాలన్నారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించాలన్నారు. రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ టీఎస్ఎన్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ యూటీఎఫ్ మండల శాఖలు బలోపేతం చేయాలని, సభ్యత్వం పూర్తిచేసి ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. నూతన ఉపాధ్యాయులకు సహాయ సహకారాలను అందించాలని తెలిపారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్ష మోడల్ బుక్‌లెట్ ఆవిష్కరణ

ఎనిమిదో తరగతి విద్యార్థులకు నిర్వహించే నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకి సంబంధించిన మెంటల్ ఎబిలిటీ టెస్ట్ మెటీరియల్‌ను జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంయుక్తంగా ప్రచురించిన బుక్‌లెట్‌ను రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ కాసిం పీరా, సహాధ్యక్షులు జెవిడి నాయక్, జిల్లా సహాధ్యక్షురాలు ఎ.బాగేశ్వరిదేవి, కోశాధికారి ఎం.రవిబాబు, జిల్లా కార్యదర్శులు మండల బాధ్యులు, సీనియర్ నాయకులు, ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.